క్లుప్తంగా

బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు



మొగల్తూరులో పూజలను అందుకుంటున్న వినాయకుడు

మొగల్తూరు: వినాయక చవితిని పురస్కరించుకుని స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా మండపం ఏర్పాటు చేసి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వెంకటేశ్వర స్వామి వారి ఆలయ అర్చకులే నిత్యం వినాయకునికి పూజలు నిర్వహిస్తున్నారు. అయితే వినాయకుని విగ్రహం ఆకట్టుకోవడంతో గ్రామంలోని భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. సోమవారం స్వామి వారిని మొగల్తూరు గ్రామంలో ఊరేగించి నిమజ్జనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు సామగ్రిని అందజేయాలి



పారిశుద్ధ్య కార్మికుల సామగ్రిని పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం రూరల్: మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన పనిముట్లు, ఆరోగ్య పరిరక్షణకు కావాల్సిన వస్తువులను సకాలంలో అందజేయాలని సంబంధిత అధికారులను నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఆదేశించారు. శనివారం ఉదయం ఆయన క్షేత్ర స్థాయి పర్యటనల్లో భాగంగా వార్డుల్లో పర్యటించి కార్మికులకు ఇస్తున్న సామగ్రి నాణ్యతను పరిశీలించారు. అనంతరం కొన్ని ప్రదేశాల్లో జంగిల్ క్లియరెన్స్ చేయించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, కిషోర్ ఉన్నారు.

అద్దేపల్లి సేవలు స్ఫూర్తిదాయకం



ఎస్వీ రావును సత్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కళాశాల విద్యను అందించాలని లక్ష్యంతో తన సొంత నిధులు దాతృత్వంగా ఇచ్చి కళాశాలను ఏర్పాటు చేసిన శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో శనివారం శ్రీ అద్దేపల్లి జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా కళాశాల ఆవరణలో సరస్వతి దేవి విగ్రహాన్ని నిర్మించిన దాత రిటైర్డ్ అధ్యాపకుడు ఎస్వీ రావును మంత్రి నిమ్మల శాలువా తో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



బీఆర్ఎంవీ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ప్రతి ఒక్కరూ జాతీయ భాష అయిన హిందీ భాషను తప్పనిసరిగా నేర్చుకోవాలని ఇన్‌చార్జి హెచ్ఎం యు.పెద్దిరాజు తెలిపారు. శనివారం స్థానిక బీఆర్ఎంవీ మునిసిపల్ హైస్కూల్‌లో హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ హిందీ నేర్చుకోవడం వల్ల జాతీయ సమైక్యత అనే భావన కలుగుతుందన్నారు. భాష మనుషులను కలపడానికి వారధిగా పనిచేస్తుందన్నారు. మాతృభాష తెలుగుతో పాటు మిత్ర భాషలైన ఆంగ్లం, జాతీయ బాష అయిన హిందీని నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హిందీ భాషలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉదయ్ కుమార్, దుర్గారావు, సూర్యనారాయణ రాజు, రామ్మోహన్ పాల్గొన్నారు.

నిందితుడి అరెస్ట్

భీమవరం: భీమవరం టూటౌన్ పరిధిలో మహిళను అత్యాచారం చేసిన నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 11న సంఘటన జరగ్గా బాధితురాలు 12వ తేదీన ఫిర్యాదు చేసిందన్నారు. నిందితుడైన సీహెచ్ మధుకుమార్‌ను పట్టణంలోని 18వ వార్డులోని అతని ఇంటి వద్ద శనివారం ఉదయం డీఎస్పీ ఆర్.జి. జయసూర్య ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని పోలీసులు తెలిపారు.

శాంతించిన గోదావరి

లంక గ్రామాలను వీడిన వరద

యలమంచిలి: గోదావరి శాంతించింది. మండలంలోని కనకాయలంక కాజ్ వే మినహా పెదలంక, దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక, బాడవ గ్రామాలన్నీ వరద ముంపు నుంచి బయటపడ్డాయి. అయితే కనకాయలంక కాజ్ వే మీద మాత్రం ఇంకా మూడు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో ఇక్కడ అధికారులు ఇంజిన్ పడవలు ఏర్పాటు చేశారు. కనకాయలంక ప్రజలంతా తమ దైనందిన అవసరాల కోసం ఈ పడవలపై ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. వరద ప్రభావం వల్ల దొడ్డిపట్ల ఫెర్రీలో పడవలు, అబ్బిరాజుపాలెం ఫెర్రీలో పంటు రాకపోకలు నిలిపి వేశారు. దీంతో కనకాయలంకలో పాడి పశువులు, వ్యవసాయ భూములు ఉన్న దొడ్డిపట్ల రైతులు సుమారు 25 కిలోమీటర్లు ప్రయాణించి రాజోలు మీదుగా కనకాయలంక వెళ్లాల్సి వస్తుంది. వరద తగ్గిన నేపథ్యంలో రెండు ఫెర్రీలలో పడవ, పంటు ప్రయాణాలు పున ప్రారంభించాలని రైతులు, వ్యవసాయ కూలీలు కోరుతున్నారు.

ఆచంటలో..

పెనుగొండ: గోదావరి ఉధృతి మరింతగా తగ్గింది. దీంతో నీటిమట్టం వేగంగా తగ్గుతుంది. శనివారం సిద్ధాంతం, కోడేరుల్లోని పుష్కరఘాట్లు బయట పడుతున్నాయి. వరద నీరు తగ్గడంతో రేవులన్నీ మట్టితో నిండిపోయాయి. లంకగ్రామాల్లో రహదారులు సైతం బురదతో నిండిపోయాయి. మరింతగా తగ్గే వరకూ లంక గ్రామాల నుంచి రాకపోకలు నియంత్రించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నీరు వడిగా వెళుతుండడంతో పడవ ప్రయాణాలు ప్రమాదకరంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు.



యలమంచిలి: కనకాయలంక కాజ్ వేపై ప్రవహిస్తున్న వరద నీరు



యలమంచిలి: కనకాయలంకలో పడవలపై కాజ్ వే దాటుతున్న ప్రజలు



పెనుగొండ: బురద పేరుకుపోయిన కోడేరు రేవు

రైతులకు నష్టపరిహారం అందించాలి

మొగల్తూరు: సార్వా సాగు చేపట్టి ఆర్థికంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని మండలంలోని రామన్నపాలెం పంచాయతీకి చెందిన రైతులు డిమాండ్ చేస్తున్నారు. దర్బరేవు డ్రెయిన్ ఆటుపోటుల కారణంగా తమ చేలల్లో ఏడాది పొడవునా నీరు నిలిచిపోతుందని పేర్కొంటున్నారు. దీనివల్ల ప్రతి ఏటా రెండు పంటలూ నష్టపోతున్నామని చెబుతున్నారు. ఈ ఏడాది జూన్ ఆఖరి వారంలో తమ ప్రాంతంలోని చేలల్లో నీరు లాగడంతో జూలైలో రెండు సార్లు నాట్లు వేశామని, రెండు సార్లూ వర్షాల కారణంగా పంటలు మునిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు తోడు వాగులు, వంకలు పొంగడంతో దిగువ ప్రాంతంలో ఉన్న దర్బరేవు డ్రెయిన్ పొంగి తమ భూములను పూర్తిగా ముంచి వేసిందని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి సాగు చేపట్టి నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలని కోరుతున్నారు. ఇక ఈ ఏడాదికి సార్వా సాగు చేపట్టే పరిస్థితి లేదని ప్రభుత్వం ఎకరాకు రూ.6800 నష్టపరిహారం ఇస్తామని ప్రకటించిందని, ఆ నష్ట పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ముంపులో ఉన్న చేనులో రైతు పాండురంగారావు

జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీ

నరసాపురం రూరల్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 134 కేసులు పరిష్కారమైనట్లు నరసాపురం మండలం న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ విజయదుర్గ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో సివిల్ 28, మోటార్ వెహికల్ కేసులు 4, కుటుంబ తగాలు 3, చెక్ బౌన్స్ 10, బీఎస్ఎన్ఎల్ 3, బ్యాంక్ ఆఫ్ బరోడా 6, నరసాపురం రూరల్, టౌన్, మొగల్తూరు, యలమంచి పోలీస్ స్టేషన్‌లకు సంబంధించి 80 క్రిమినల్ కేసులు వెరసి 134 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జి.గంగరాజు, ఆర్.వరలక్ష్మి, కె.శ్రీనివాస్, సభ్యులు దుర్గాభవాణి, నాగేశ్వరరావు, జాన్ కెనడీ, సుభాస్ బాబు తదితరులు ఉన్నారు. సీనియర్ న్యాయవాది కె.స్వామినాయుడు కక్షిదారులకు ఆహారం పంపిణీ చేశారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: కక్షిదారులు తమ విలువైన సమయాన్ని నగదును సద్వినియోగం చేసుకోవడానికి లోక్ అదాలత్‌లు ఎంతగానో దోహదపడతాయని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ షేక్ జియావుద్దీన్ అన్నారు. శనివారం పట్టణ కోర్టు సముదాయంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 109 కేసులు పరిష్కారం అవ్వగా కక్షిదారులు రూ. 82,50,000 పరిహారంగా అందుకున్నారు. ఈ సందర్భంగా అదనపు సివిల్ జడ్జి పీవీఎస్ఎన్ లక్ష్మీ లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్‌వీ సూర్యనారాయణ పాల్గొన్నారు.



నరసాపురం కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్టివల్

నరసాపురం రూరల్: నరసాపురం మండలం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. కళాశాల మెకానికల్ అండ్ రోబోటిక్స్ డిపార్ట్‌మెంట్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఆర్ఐ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఇంజినీరింగ్‌లో బ్రాంచి ఏదైనా అంకితభావంతో విద్యను అభ్యసిస్తే రాణింపు సులభమవుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అప్‌డేట్ కావాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలుగులోనికి వచ్చేందుకు ఇటువంటి ఫెస్టివల్స్ దోహదపడతాయన్నారు. కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి త్రినాద్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గోపీచంద్ తదితరులు మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్ చేసిన విద్యార్థులు అటు సాఫ్ట్‌వేర్, ఇటు మెకానికల్ రంగం రెండింటా రాణించవచ్చునన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉత్తమ విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలను అందించారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎస్ఆర్ఐ కొవ్వలి నాయుడు, కళాశాల యాజమాన్యం

ఆక్రమణదారులకు నోటీసులు

ఆకివీడు: పంట కాలువ, రోడ్డు ఆక్రమణల్లో ఉన్న ఇళ్లను తొలగించేందుకు శనివారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. కుప్పనపూడి పంచాయతీ పరిధిలోని 141 మంది స్థానిక అయిభీమవరం రోడ్డులో పంట, రోడ్డు పోరంబోకులను ఆక్రమించుకుని గత 40 ఏళ్లుగా నివశిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆక్రమణల తొలగింపులో భాగంగా వారికి నోటీసులు జారీ చేస్తుండగా చాలా మంది బాధితులు నోటీసులు తీసుకోలేదు. దీంతో వారి ఇళ్ల గోడలకు అంటించి వెళ్లిపోయారు. రెండు, మూడు తరాలుగా ఈ ప్రాంతంలో జీవిస్తున్నామని, మాకు ఇంటి పన్ను, విద్యుత్, ట్యాప్ కనెక్షన్లు ఇచ్చారని, తమను అర్థాంతరంగా ఖాళీ చేయించడం తగదని బాధితులు వాపోతున్నారు. తమకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇచ్చారని, అయితే అవి చెరువును తలపిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థలం పూడ్చకుండా, ఇళ్లు నిర్మించుకునేందుకు సహాయం అందజేయకుండా తమను బలవంతంగా ఖాళీ చేయించడం దారుణమని వారు వాపోయారు. పలువురు నోటీసులు తీసుకోగా, మరి కొంత మంది నిరాకరించడంతో వాళ్ల ఇళ్లకు అంటించినట్లు కార్యదర్శి ఆనంద భూషన్, వీఆర్‌ఓ దానయ్య చెప్పారు.



అయిభీమవరం రోడ్డు వెంబడి ఉన్న ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తున్న దృశ్యం

దివ్యాంగురాలిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

నరసాపురం రూరల్: నరసాపురం నియోజకవర్గ మదర్ థెరీసా దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యురాలిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ నరసాపురం రూరల్ పోలీసులకు దివ్యాంగుల సంఘం నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి దివ్యాంగులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లవరం పెదలంకకు చెందిన కుసుమ విజయ నిర్మల, ఆమె తండ్రి విజయరత్నాలు ఈ నెల 12వ తేదీన ఇంటి వద్ద జీవనోపాధి నిమిత్తం లేసు అల్లికల పని చేసుకుంటున్నారు. ఆ సమయంలో తోట చిట్టిబాబు, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, వేగి నరసింహులు అనే నలుగురు వచ్చి దివ్యాంగురాలైన విజయనిర్మల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని, దివ్యాంగుల సంఘంలో నాయకురాలిగా తిరుగుతున్నావంటూ హేళన చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిన్ను నీ తండ్రిని ఏమి చేసినా అడిగే దిక్కు లేదంటూ వీల్ చైర్ నుంచి కిందకు లాగి రాడ్డుతో గాయ పరిచారన్నారు. దివ్యాంగురాలైన విజయనిర్మల అతని తండ్రిపై దాడి చేసినవారిని వెంటనే అరెస్టు చేసి దివ్యాంగుల సంక్షేమ చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని కోరాఉ. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని దివ్యాంగులు పెద్ద సంఖ్యలో రూరల్‌పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విజయనిర్మలకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.



రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

పశువుల దాణా అందజేత

ఆకివీడు: ముంపు ప్రాంతాల్లో నోరు లేని జీవాలకు ఆహారం అందించడం మన కర్తవ్యమని పశుసంవర్థక శాఖ ఉప సంచాలకులు జవహర్ హుస్సేన్ చెప్పారు. మండలంలోని సిద్ధాపురం, కోళ్లపర్రు, చినమిల్లిపాడు, కాళింగగూడెం, సమతానగర్ ప్రాంతాల్లో 25 టన్నుల పశువుల దాణాను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరద ముంపునకు పచ్చగడ్డి, ఎండుగడ్డి పూర్తిగా పాడైపోయి, కుళ్లిపోయిందన్నారు. మనుషులతో పాటు పశువులు కూడా ఆహారం అందక అలమటిస్తున్నాయని జిల్లా కలెక్టర్ నాగ రాణి గుర్తించి కొల్లేరు తీర గ్రామాల్లోని పశువులకు దాణా సరఫరా చేశారని చెప్పారు.నీ దాణా పాడిరైతులందరికీ అందే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ జనార్థనరావు, మండల పశుసంవర్థక అధికారిణి భార్గవీ సత్య, మౌర్య, హను, యోహాస్, సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు, భూపతిరాజు బుజ్జిరాజు, కన్నయ్యరాజు, అంజిరాజు, తిమ్మరాజు, బొల్లా వెంకట్రావు పాల్గొన్నారు.



పశువుల దాణా పంపిణీ చేస్తున్న డీడీ జవహర్ హుస్సేన్, ఏడీ జనార్థనరావు

మోక్షగుండం సేవలు ఆదర్శనీయం

భీమవరం: భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఇంజనీర్స్ డే పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకటనర్సింహరాజు కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నర్సింహరాజు మాట్లాడుతూ మోక్షగుండం గొప్ప ఇండియన్ సివిల్ ఇంజనీర్‌గా సేవలందించారని భావితరాలకు ఆయన ఆదర్శనీయుడన్నారు. సెక్రటరీ గాదిరాజు బాబు మాట్లాడుతూ ఆధునిక భారతదేశంలో ఆనకట్టలు, రిజర్వాయర్లు, హైడ్రో-ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన గొప్ప ఇంజినీర్ విశ్వేశ్వరయ్య అన్నారు. విశ్వేశ్వరయ్యకు నివాళిగా ఏటా సెప్టెంబర్ 15న ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్‌ను సత్కరించారు. విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం అంజన్‌కుమార్, మెకానికల్ హెచ్ఓడీ హరీష్ పాల్గొన్నారు.



భీమవరం డీఎన్నార్ కళాశాలలో పీర్ అహ్మద్‌ఖాన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఏచూరి మృతి కమ్యూనిస్టులకు తీరని లోటు

భీమవరం అర్బన్: కమ్యూనిస్టు ముద్దు బిడ్డ సీతారాం ఏచూరి లేకపోవడం కమ్యూనిస్టులకు తీరని లోటని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో ఎస్సీ పేటలో శనివారం సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాప వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ సీతారామ్ ఏచూరి విద్యార్థి నాయకుడిగా అనేక సమస్యలపై ఉద్యమాలు చేయడమే కాకుండా ప్రజల పక్షాన పార్లమెంట్‌లో తన వాణి వినిపించారన్నారు. తోటి శుభాకర్‌రావు, మందా మార్తమ్మ, ఇంజేటి సామ్యేయేలు, వర్ధనపు కన్నమ్మ దాసు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీలో విద్యార్థుల సంఖ్య పెరగాలి

ఉండి: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగి, ప్రమాణాలు పెంచే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగ రాణి సూచించారు. మండలంలోని యండగండి గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఆకస్మికంగా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకుని మంచి భవిష్యత్‌ను పొందాలన్నారు. మీ భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంటున్నారు. కళాశాలలో విద్యా బోధన, వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ రామ ప్రియతో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ని గ్రూపులున్నాయి, ఎంత మంది విద్యార్థులున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులున్నాయని105 మంది విద్యార్థులు చదువుతున్నట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. తరగతి గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు.



యండగండిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీని సందర్శిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగ రాణి

గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని ఏకేపీఎస్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కెమిస్ట్రీ అతిథి అధ్యాపకుడి పోస్టు కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను కళాశాలలో కార్యాలయ పని వేళల్లో 17 తేదీ సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని పేర్కొన్నారు.

వైభవంగా నిమజ్జనోత్సవాలు

కాళ్ల: గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. భారీ భారీ ఊరేగింపుల నడుమ, బాణసంచా కాల్పులతో యువకులు డ్యాన్సులతో గణనాథు విగ్రహాలను నిమజ్జనం చేశారు. ప్రధానంగా కాళ్ల, కాళ్లకూరు, దొడ్డనపూడి, ఏలూరుపాడు, కోపల్లె, బొండాడ, కలవపూడి తదితర గ్రామాల్లో ఘనంగా నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా పలు గ్రామాల్లో నవరాత్రులను పురస్కరించుకుని భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

అమ్మవారి ఆలయం వద్ద బుర్రకథ

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మవారి దేవస్థానంలోని విగ్నేశ్వరస్వామి స్వామి మందిరంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. తాడేపల్లిగూడెంకు చెందిన శ్రీ గణపతి బుర్రకథ బృందం ప్రదర్శన ఆకట్టుకుంది. బుర్రకథ కళాకారులను ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

మొగల్తూరు: విద్యార్థులు మంచి ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్సై జి.వాసు సూచించారు. మొగల్తూరు ప్రతిభ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం విద్యార్థులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ అవగాహన కల్పించారు. ఎవరైనా వ్యక్తులు మీరు చదువుతున్న విద్యాలయం లేదా బయట ఎలాంటి అసభ్య ప్రవర్తనకు పాల్పడినా వెంటనే స్కూల్‌లోని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండడం, చెడు స్నేహాలకు దూరంగా ఉండడం మేలని సూచించారు.

నిత్యావసరాల అందజేత

పెనుగొండ: ప్రేమే మార్గం, సేవే లక్ష్యం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు మరింత సేవ చేయడానికి కృషి చేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ నల్లా రాధాకృష్ణ తెలిపారు. శనివారం వల్లూరులో వల్లూరు పాస్టర్ హోప్ ఆర్థిక సహకారంతో పేద కుటుంబాలకు నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో కుసుమే సత్యనారాయణ, చింతపర్తి రాజేష్, బెజవాడ ఉపేంద్ర, అడపా హేమంత్, చిల్లే రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి



సిద్ధాంతంలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: దేశ లౌకిక వ్యవస్థను అణగదొక్కే ప్రతి అంశంలోనూ ప్రజల కోసం తిరుగులేని పోరాటం చేసిన మహాయోధుడు సీతారామ్ ఏచూరి మృతి దేశానికి తీరని లోటని సిద్ధాంతం సీపీఎం కార్యదర్శి కప్పల రత్నరాజు అన్నారు. శనివారం సిద్ధాంతం రావిచెట్టు సెంటర్‌లో సీతారం చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కే పుల్లారావు, పులిదిండి రామారావు, పెచ్చెట్టి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

వడలిలో అన్న సమారాధన

పెనుగొండ: గణపతి నవరాత్రులు సందర్భంగా శనివారం వడలిలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. కమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనలో ఆలయం వద్ద ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

పెనుగొండ: వల్లూరు వరక్తుల చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వరద బాధితులకు సాయం చేసేందుకు సేకరించిన విరాళాలను చెక్కు శనివారం వీఆర్‌ఓ కె.నాగశ్వరరావుకు అందించారు. ఈ సొమ్మును బాధితులకు సాయం అందించే కార్యక్రమాల్లో వాడాలని కోరారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు కడారి వెంకట రామకృష్ణ, ఏడిద శ్రీనివాస్, తాళం శ్రీనివాస్, రామన శ్రీనివాస్, వీరాస్వామి, కిరణ్ అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ వినియోగాన్ని తగ్గించాలి

నరసాపురం రూరల్: విద్యార్థులు మొబైల్ ఫోన్ వినియోగాన్ని తగ్గించి ఆ సమయాన్ని విద్యకు కేటాయించడం ద్వారా ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవచ్చని నరసాపురం ఆర్డీవో అచ్యుత అంబరీష్ అన్నారు. శనివారం స్థానిక శ్రీసూర్య కళాశాలలో నిర్వహించిన టీచర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు గురువులే నిజమైన హీరోలు గురువులేనని వారిని గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు టి.సత్యనారాయణ, అధ్యాపకుడు పేరాల మోహన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.